## క్లుప్తంగా

### ఘనంగా గంగమ్మ జాతర


అలంకరణలో గంగమ్మ అమ్మవారు

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామస్తులు గురువారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. బుధవారం రాత్రి అమ్మవారిని విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు వివిధ వేషధారణల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

### 2న గరుడసేవ


కరియమాణిక్యస్వామి ఆలయం

నగరి : పట్టణ పరిధిలోని టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో జూన్ 2న కంచి గరుడసేవ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లను టీటీడీ అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే ఆలయ సేవకులు, భక్తులు గరుడసేవకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ముద్రించి పట్టణ పరిధిలో పలుచోట్ల అతికించారు. టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ గురువారం ఆలయానికి విచ్చేసి గరుడసేవ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. గరుడసేవలో పాల్గొనే భక్తులకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ ఈఓ తెలిపారు.

### ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరంగరాజపురం : నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలలోనే సాధ్యం అవుతుందని 49 కొత్తపల్లి మిట్ట బాలికల జూనియర్ కళాశాల హెచ్ఎం బండి లలిత కుమారి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బాలికల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులుతో కలిసి గ్రామాల్లో తిరిగి ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించాలన్నారు. ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలుతో క్రమశిక్షణ, సామాజిక స్పృహ, స్వీయ అభ్యసనకు అధిక ప్రాధాన్యత కల్పించి మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాలు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థికాభివృద్ధికే జగనన్న పాల వెల్లువ


పాల వెల్లువ గురించి మాట్లాడుతున్న సునీల్‌దత్

పుత్తూరు రూరల్: మహిళా పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడానికే ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రారంభించిందని మున్సిపల్ కౌన్సిలర్ సి.గుణశేఖర్ తెలిపారు. గురవారం పాల వెల్లువ రూట్ ఆఫీసర్ కె.సునీల్‌దత్, అమూల్ ఫీల్డ్ ఆఫీసర్ వి.వాసుతో కలిసి పాడి రైతులకు అవగాహన కల్పించారు. పుత్తూరు పట్టణ పరిధిలోని కట్టకిందరామకృష్ణాపురం, గొల్లపల్లి రూరల్ పరిధిలోని తడుకు, గోపాలకృష్ణాపురం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సంస్థల కన్నా లీటరు పాలుపై పాల వెల్లువ ద్వారా రూ.5 అధికంగా పొందవచ్చని చెప్పారు. స్వచ్ఛమైన బర్రెపాలు లీటరు ధర రూ.33 నుంచి రూ.90 వరకు ఉంటుందన్నారు. కట్టకిందరామకృష్ణాపురం, గొల్లపల్లి హరిజనవాడల్లో పాల వెల్లువ సెక్రటరీలను నియమించారు.

### అక్రమ వినియోగాన్ని అరికట్టాలి


సబ్‌స్టేషన్‌లో రీడింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

పాలసముద్రం : మండలంలో మీటర్లు లేకుండా వినియోగించే అక్రమంగా విద్యుత్ వాడకాన్ని అరికట్టాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన రాచపాళెం సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్‌ను ఇవ్వాలన్నారు. రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా సక్రమంగా విద్యుత్ ఇవ్వాలని సూచించారు. లైన్‌మెన్ రైతులకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మీటర్లు తీసుకోకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో రీడింగ్, రికార్డులను పరిశీలించారు. డీఈ పద్మనాభపిళ్లై, ఏడీ జ్ఞానేశ్వరరావు, ఏఈ వరదరాజు పాల్గొన్నారు.

# సేవాలయాలు


కాళికాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం


కాళికాపురం సచివాలయంలో పింఛన్ పొందిన లబ్ధిదారులు,

- సత్ఫలితాలు ఇస్తున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు
- ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రాష్ట్రప్రభుత్వం
- గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారం
- గతంలో మండల కేంద్రాలకు పరుగులు
- ఆనంద వ్యక్తం చేస్తున్న ప్రజలు

**గతంలో ఏ సర్టిఫికెట్ కావాల్సి వచ్చినా, ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి పరుగులు తీసే పరిస్థితి ఉండేది. రెవెన్యూ, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగే పరిస్థితులు మారాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా గ్రామాల్లో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతుండడంపై ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.**

విజయపురం (నగరి): ప్రభుత్వ పథకాలు, పౌర సేవలు ప్రజలకు సులభంగా అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల పట్ల అన్నివర్గాల ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. పాదయాత్ర సమయంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే పేదలు పడుతున్న ఇబ్బందులు, వారి స్థితిగతులను నాటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్లారా చూశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను చూసి చలించిపోయారు. దీంతో అప్పుడే ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఆలోచన మొదలైంది. లోకల్ గవర్నెన్స్‌తో ప్రజల ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయి.

**కోడి కూసే వేళకే పింఛన్ అందజేత..**

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. అంతేగాకుండా మండల కేంద్రాలకు పరుగులు తీసే ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామాల్లోనే వారి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారు. విజయపురం మండలంలో విజయపురం, ఇల్లత్తూరు, కోసలనగరం, శ్రీహరిపురం, సూరికాపురం, జగన్నాథపురం, పన్నూరు, కలియంబాకం, బూచివానత్తం, ఆలపాకం, కాళికాపురం, కేవీపురం పంచాయతీల్లో మొత్తం 12 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ప్రజలు, మహిళలు, రైతులు, విద్యార్థులకు అన్ని ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటి వద్దకే అందిస్తుండడంతో సచివాలయాలపై ప్రజలకు నమ్మకం ఏర్పడింది. దీనికితోడు ఒకటో తేదీ రాగానే కోడి కూసే వేళకే వృద్ధులకు పింఛన్ చేరుతోంది.


పన్నూరు నూతనంగా ప్రారంభించిన సచివాలయం

**15 రోజుల్లోనే పాస్‌బుక్‌లు ఇచ్చారు..**



మా నాన్న కుప్పారెడ్డి పేరు మీద 5 ఎకరాల భూమి ఉంది. మా నాన్న నాకు 3 ఎకరాల భూమి రాసి ఇచ్చాడు. పట్టాపాసుపుస్తకం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. అలాగే దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపే పట్టాదారు పాసుపుస్తకం అందించారు. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– పాండియన్, కాళికాపురం, రైతు

**నెలరోజుల్లోనే ఇల్లు..**



మా గ్రామం నుంచి ఎంపీడీఓ ఆఫీసుకు వెళ్లడానికి బస్సు, ఆటో సౌకర్యం కూడా లేక ఇబ్బందిగా ఉండేది. గత ప్రభుత్వంలో ఇంటి కోసం ఎంపీడీఓ ఆఫీసులకు తిరిగి తిరిగి అలసిపోయాను. ఇప్పుడు మా గ్రామంలో సచివాలయం ఏర్పాటయ్యాక ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. దీంతో నెల రోజుల్లో ఇల్లు మంజూరైంది. ఇల్లు కూడా కట్టుకున్నాను. జగనన్నకు థ్యాంక్స్.

– జయంతి, కాళికాపురం గ్రామం

**ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలు..**



గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. దీంతో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఈ రాష్ట్రప్రభుత్వానికి దక్కుతుంది. లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండానే వారికి ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. కేవలం వారి అర్హత, ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను వలంటీర్లకు అందిస్తే సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నాం.

– సురేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి, విజయపురం

# వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


రైతులకు సబ్సిడీ వేరుశగన విత్తనకాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం


వలంటీర్లను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు మరువలేనివని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంచి సేవలు అందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం వరుసగా మూడో విడత అవార్డులను ప్రదానం చేసింది. సేవారత్న, సేవా వజ్ర, సేవామిత్ర పేరిట అవార్డులను పొందిన వలంటీర్లను గురువారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రతి గ్రామం, పట్టణంలో వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకే వెళ్లి పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కొన్ని మారుమూల గ్రామాలకు కాలి నడకన వెళ్లి మరీ పథకాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలు సైతం ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు.

**విత్తనకాయల పంపిణీ..**

అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు సబ్సిడీతో అందిస్తున్న విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని 810 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల పంపిణీ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 30 కేజీల సంచి సబ్సిడీ పోనూ రూ.1,674కే ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, సర్పంచ్ హరిత, మండల కన్వీనర్ మణి, డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ బాలసుబ్రమాణ్యం రెడ్డి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, ఏట చిట్టిబాబు, నాయకులు విజయాబాబు, కుప్పయ్య, జనార్ధన్, గోవిందయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్ల సేవలు మరువలేనివి


వలంటీర్లను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వెదురుకుప్పం: సీఎం వైఎస్ జగనన్న ఆశయాలు, ఆలోచనలే శిరోధార్యమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన తపన, పాలనలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులే తలమానికమని చెప్పారు. గురువారం వెదురుకుప్పంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలన్నా సంకల్పంతో ప్రభుత్వం వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ వలంటీర్లు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకరరావు, ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్ సంఘ అధ్యక్షురాలు భారతి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఎంపీటీసీలు గుణశేఖర్, రాధిక, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్‌లు శిల్ప, భువనేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి కోలార్ ప్రకాష్, సీనియర్ నాయకులు ధనుంజయరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం


పెనుమూరు: గుంటిపల్లెలో వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్


పెనుమూరులో వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పెనుమూరు మండల జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుంటిపల్లె రైతు భరోసా కేంద్రంలో జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, పెనుమూరు మార్కెట్ యార్డు నందు కమలాకర్‌రెడ్డి రైతులకు వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు ఎల్లప్పుడు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ముందస్తుగానే పెట్టుబడి నిధిని అందించి పంటల సాగుకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, సాతంబాకం ఎంపీటీసీ యశోదారెడ్డి, నాయకులు యం.సురేష్ రెడ్డి, దూది మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామదేవత చెల్లమ్మకు పొంగళ్లు


అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

నింద్ర: మండల కేంద్రం నింద్ర గ్రామదేవత చెల్లమ్మకు గురువారం పొంగళ్లు పెట్టారు. గంగమ్మ జాతరను పురస్కరించుకుని గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వాశయం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన తూగుండ్రం సచివాలయ పరిధిలోని పిళ్లారికుప్పం, తాటిమాకుల కండ్రిగ, తూగుండ్రం దళితవాడ, తూగుండ్రం గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి గురించి వివరించారు. అనంతరం గ్రామస్తులు స్థానిక దళితవాడలో మురుగునీటి కాలువల్లో పూడిక తీయాలని, గ్రామానికి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని, పిళ్లారికుప్పం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణులకు అందించే పౌష్టికాహారం అందడం లేదని విన్నవించారు. వీటిపై మంత్రి స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన తూగుండ్రం గ్రామ రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ శ్రీబాబు, ఎంపీటీసీ వాణిశ్రీ, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, నాయకులు లోకనాథం, చిట్టిబాబు, రాజేంద్రరెడ్డి, ఆదిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరి, జాన్, ఉమాపతి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, విద్యుత్ ఏడీఈ జ్ఞానేశ్వర్ పలువురు పాల్గొన్నారు.

# పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే



మాట్లాడుతున్న న్యాయవాది మురగేశన్‌రెడ్డి


సదస్సుకు హాజరైన మహిళలు

పుత్తూరు రూరల్: పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు వారి పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని సీనియర్ న్యాయవాది మురగేశన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎన్జీఓ కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో పిల్లలు ఇల్లు వదలి వెళ్లే పరిస్థితిని తల్లిదండ్రులు కల్పించరాదని సూచించారు. తీర్థయాత్రలు, ఇతర నగరాలకు వెళ్లే సమయాల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. తప్పిపోయిన పిల్లల కోసం ప్రభుత్వం సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎవరికైనా అనాథలు, తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే సంరక్షణా కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కి ఫోన్ ద్వారా సమాచారమైనా అందించవచ్చని వివరించారు. బాలకార్మిక నిర్మూలన, బాల్య వివాహ నిషేధం, లింగ నిర్ధారణ చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# డిఫాల్టర్ గ్రూపులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ కార్యాలయ సిబ్బంది

పాలసముద్రం : మండల పరిధిలో ఇచ్చిన రుణాలను సక్రమంగా చెల్లించపోయి డిఫాల్టర్ గ్రూపులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని వినియోగంలోకి తేవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్ర, డ్వాక్రా లీడర్లకు ఆయన సమీక్ష నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ సోషల్ మొబిలైజేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా మండల సమాఖ్య పరిధిలో డ్వాక్రా గ్రూపుల్లో చేరకుండా మిగిలిపోయిన వారిని గ్రూపుల్లోకి చేర్పించాలని తెలిపారు. ఆగిపోయిన గ్రూపులను తిరిగి నడిపించాలని సూచించారు. ప్రతి సభ్యురాలు ఆర్థిక నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి వంటి రుణాలను సక్రమంగా కట్టించాల్సిన బాధ్యత సంబంధిత సంఘమిత్రలపై ఉందని సూచించారు. డిజిటల్ లావాదేవీలపై వివరించారు. అనంతరం మండలకేంద్రం నుంచి పాలసముద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, శోభ, అరుణ, గీత, యసోద, జయలక్ష్మి, బాలయ్య పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా ప్రభుత్వం


కార్వేటినగరం: వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారని ఎంపీపీ లత అన్నారు. గురువారం మండలకేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనకాయలను ఏఓ హేమలత ఆధ్వర్యంలో ఎంపీపీ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు రైతు భరోసా ఇవ్వడంతో పాటు 40 శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తూ విత్తు నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. సంక్షేమాలు అందించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తిరుగులేదని, అలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి రైతులు, అవ్వతాతలు, మహిళలు, యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఓ హేమలత మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించే వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 30 కేజీ బస్తా రూ.1773, సబ్సిడీ పోను రూ.1182లకే అందించడం జరుగుతుందన్నారు. వేరుశనగ విత్తనాలకు వచ్చే రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్, చందురాజు, వెంకటేష్, వెంకటరత్నం, ఏఈఓలు గాయత్రి, హేమాద్రి, సచివాలయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.


వెదురుకుప్పం : విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**వెదురుకుప్పంలో..**

వెదురుకుప్పం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. గురువారం వెదురుకుప్పంలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి హాజరయ్యారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లోకనాథరెడ్డి, ఎంపీటీసీ రాధిక, సర్పంచ్ శిల్ప, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, సీనియర్ నాయకులు ధనుంజయరెడ్డి, మునికృష్ణారెడ్డి, ఆనందరెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


బోధిస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి

కార్వేటినగరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. గురువారం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అభివర్ణించారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, చరిత్ర పుస్తకాలను పఠించడం వల్ల పోటీ పరీక్షల్లో సులువుగా పట్టు సాధించగలరని సూచించారు. అదేవిధంగా పురాణ గాథల్లోని నృసింహ అవతరాన్ని, ప్రహ్లాదుడి భక్తిని, హిరణ్యకశిపుడి గాథలను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, ఉపాధ్యాయురాలు భారతి పలువురు పాల్గొన్నారు.